మాట అనుకుంటూ ''నేను వస్తానాంటీ'' అంటూ రాజీ వెళ్లిపోయింది.

ఇంట్లోకి వచ్చినా రాజీ ఆలోచనలన్నీ వాళ్లమీదే ఉన్నాయి. ఇంత ప్రేమగా ఉండే ఈ కొడుకులందరూ ఒక్కళ్లైనా తల్లిదండ్రుల దగ్గర ఉండాలని కానీ వాళ్లని దగ్గర పెట్టుకుందామని కానీ ఆలోచనే రాదా? సంక్రాంతి, ఉగాది, విజయదశమి, దీపావళి వాటితోపాటు ఈమధ్య కొత్తగా వచ్చిన ఈ 'మదర్స్ డే'కి వచ్చి నలుగురూ బట్టలూ, స్వీట్స్, పళ్లతోపాటు మందులకి అంటూ కొంత డబ్బు ఇచ్చి వెళ్లిపోతారు. పెద్దకొడుకు అంబాసిడర్, రెండో కొడుకు ఎర్రమారుతీ, మూడోవాడు జెన్, నాలుగో అబ్బాయి ఇండికాలో వచ్చి వెళుతుంటే ఆ పండగలే ఈ ముసలి దంపతులకి అసలైన పండగలు. ఉత్తప్పుడంతా ఆ కామాక్షమ్మగారు ఇంటికి ఎవరు వచ్చినా కాలునెప్పి చెయ్యి నెప్పి అంటూ రోగాలతోపాటు తను వాడే మందుల లిస్ట్, ఆయన వాడే మందుల లిస్ట్ చెప్పేవారు. అలాంటిది కొడుకులు వచ్చే రోజు మాత్రం ఇద్దరూ నవదంపతుల్లా తయారైపోయి వాళ్లకి స్వాగతం చెపుతారు.

కానీ రాజీకి అర్థంకానిదొక్కటే. వాళ్లకి ఈ వయసులో స్వీట్లూ, బట్టలూ, ఆభరణాలు అవసరమా అని.

ఓపికున్న రోజు వండుకుని, లేని రోజు ఏ టిఫిన్లో తెప్పించుకుని తింటూ గడిపే ఆ ముసలి దంపతుల ముఖాల్లో ఎప్పటికీ ఆ సంతోషం, హుషారు చూడాలంటే ఊళ్లోనే అందరికీ కార్లున్నాయి కాబట్టి కొడుకులు వారానికో, పది రోజులకో ఒకసారి వచ్చి వెళుతుంటే ఆ దంపతులిద్దరూ నూరేళ్లూ ఆరోగ్యంగా ఉండి మదర్స్‌డేలు కాదు, పేరెంట్స్‌డేలు చేసుకుంటారని ఆ కొడుకులందరికీ గట్టిగా చెప్పాలని తనలో తనే ఆవేశపడిపోయింది.

అంతలో గేటు తీసుకొని కొడుకులు తెచ్చిన స్వీట్లు, పళ్లు ప్లేటులో పట్టుకుని పార్వతీదేవిలా నడిచి వస్తున్న కామాక్షమ్మగారిని చూసి మదర్స్‌డే అర్థం పూర్తిగా తెలియకపోయినా రాజీకి ఆ మాతృమూర్తి అసలైన దేవతలా కనిపించి కళ్లు చెమరించాయి. అసంకల్పితంగా లేచి వెళ్లి ఆమెకి నమస్కరించింది.

**-ఎం. లక్ష్మి** ( బెంగుళూరు)

# విధివిలాసం

ఉదయం ఆలస్యంగా నిద్రలేచిన రాఘవ తమ ఫ్యాక్టరీ వర్క్స్ మేనేజర్ పాండే ఇంట్లో ప్రమాదం జరిగిందని తెలియడంతో ఉన్నఫళంగా పరిగెత్తాడు.

రాఘవ వెళ్లేసరికి పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. ఎల్.పి.జి. సిలిండర్ లీక్ అవడంతో పాండే భార్య గమనించలేదట. వంట చేస్తుంటే సడెన్‌గా సిలెండర్ పేలిపోయి ప్రమాదం సంభవించింది. వంటిల్లూ, ఆ ప్రక్క గదీ పూర్తిగా శిథిలమైపోయాయి. చావుబతుకులలో ఉన్న పాండే భార్యను ఆసుపత్రికి తరలించారు.

పాండేని పలకరించే ధైర్యం చాలక ప్రేలుడు సంభవించిన ప్రదేశాన్ని చూపులతోనే సర్వే చేశాడు రాఘవ. అతని దృష్టి ప్రేలుడికి కరిగిపోగా తునాతునకలయి పడివున్న సిలిండర్ ముక్కలలో ఒకదానిమీద పడింది. అప్రయత్నంగా దానిని తీసిన రాఘవ అదిరిపడ్డాడు.


ఆ ముక్కమీద ఎర్రటి పెయింట్‌తో పెట్టిన ఇంటూ మార్క్ ఉంది. మరుక్షణం నెల రోజుల క్రితపు సంఘటన అతని మదిలో మెదిలింది.

గ్యాస్ సిలిండర్లను తయారుచేసే కంపెనీలో క్వాలిటీ కంట్రోలు ఇంజనీరుగా పనిచేస్తున్న రాఘవ, ఆరోజు వర్క్స్ మేనేజర్ పిలుస్తున్నాడని చెప్పటంతో బెదురుతూనే వెళ్లాడు.

''మిస్టర్ రాఘవా! వాటీజ్ దిస్?'' గర్జించాడు వర్క్స్ మేనేజర్ తన ముందున్న కాగితాన్ని అతనికి చూపిస్తూ.

ఫ్యాక్టరీలో కొత్తగా తయారైన ఖాళీ సిలిండర్ల మొత్తం బ్యాచ్‌నే క్వాలిటీ సరిగా లేదని రిజెక్ట్ చేస్తూ క్రితం రోజున రాఘవ రాసిన రిపోర్టు అది.

తమ కంపెనీ యల్.పి.జి. సిలిండర్లను తయారుచేసి గ్యాస్ కంపెనీలకు సప్లయి చేస్తుంది. వాటిని గ్యాస్‌తో నింపి కస్టమర్స్‌కి సప్లయి చేస్తాయి గ్యాస్ కంపెనీలు. ఆ సిలిండర్ల తయారీలో క్వాలిటీ కంట్రోల్‌ని జాగ్రత్తగా పాటించకపోయినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఫ్యాక్టరీ తయారుచేసిన లేటెస్ట్ లాట్ క్వాలిటీ విషయంలో సంతృప్తికరంగా లేకపోవడంతో దాన్నంతా రిజెక్ట్ చేశాడు రాఘవ. వాటిని మార్కెట్ చేయడానికి వీల్లేదంటూ అదే విషయం వివరంగా చెప్పాడు అతను వర్క్స్ మేనేజర్‌తో.



''నాన్సెన్స్! మొత్తం లాటంతా రిజెక్ట్ చేస్తే కంపెనీకి ఎంత నష్టం వస్తుందో ఆలోచించావా?'' రంకెలు వేశాడు వర్క్స్ మేనేజర్. ''వెంటనే వాటిని రీఎగ్జామిన్ చేసి ఓకే చెయ్యి.''

''అయాం సారీ సార్! నేను క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ని. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చి ప్రజలను రిస్కులో పెట్టలేను'' అంటూ కచ్చితంగా చెప్పేశాడు రాఘవ అతని అరుపులకు బెదరకుండా.

''డోంట్ బీ సిల్లీ! ఐదువేలు జీతమిచ్చి నిన్ను పనిలో పెట్టుకున్నది ఫ్యాక్టరీ సరుకంతా రిజెక్ట్ చేస్తావని కాదు. సర్టిఫై చేస్తావని. ఇప్పుడు ఆ సిలిండర్లు సర్టిఫై చేయకపోయావంటే నిన్ను ఉద్యోగంలో నుంచి తీసివేయాల్సి ఉంటుంది. జాగ్రత్త'' అంటూ తీవ్రంగా హెచ్చరించాడు మేనేజర్.

రాఘవ ఉద్యోగం కోసం మనస్సాక్షిని చంపుకోలేక వెంటనే రాజీనామా ఇచ్చేసి వచ్చేశాడు. అతికష్టం మీద ఆర్నెల్ల క్రితం సంపాదించిన ఆ ఉద్యోగం అలా వదులుకోవటంతో మళ్లీ ఉద్యోగాల వేటలో పడ్డాడతను.

తాను రిజెక్ట్ చేసిన సిలిండర్లను కంపెనీ మార్కెట్ చేసిందనీ, వాటిలో ఒకటి విధివశాత్తు వర్క్స్ మేనేజర్ ఇంట్లోకి వచ్చిందనీ, ఆ సిలిండర్ ముక్కను చూడగానే గ్రహించాడు రాఘవ. ఇంకా ఎందరు అటువంటి ప్రమాదానికి గురికానున్నారోనని అతని గుండె ఝల్లుమంది.

రిజెక్ట్ చేస్తూ తాను పెట్టిన ఇంటూ మార్కున్న సిలిండర్ ముక్కను చూస్తూ నిశ్చేష్టుడైన రాఘవ దగ్గరకు వచ్చాడు వర్క్స్ మేనేజర్ పాండే. ఆ గుర్తును అతనికి చూపించాడు రాఘవ మౌనంగా.

అర్థం చేసుకున్న పాండే వదనంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేకుండా పోయింది.

**-బద్దిగం పాండురంగారెడ్డి**
(కరీంనగర్)